క్లుప్తంగా

నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఉదయం 10 గంటలకు అందుబాటులో ఉండనున్నారు. నేదురుమల్లి కార్యాలయ వర్గాలనుండి మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉండి పలువురు వైఎస్సార్‌ సీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించనున్నట్లు తెలియజేశారు.

జెడ్పీటీసీకి పరామర్శ



జెడ్పీటీసీ సభ్యురాలిని పరామర్శిస్తున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి తదితరులు

పెళ్లకూరు: పెళ్లకూరు జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లాను మంగళవారం స్థానిక ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి పలువురు వైఎస్సార్‌ సీపీ నాయకులు పరామర్శించారు. ఆమె అనారోగ్యంతో ఇటీవల తిరుపతిలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిల్లో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో అక్కగారిపేటలోని ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు ఎల్లు మోహన్‌, అశోక్‌, ఆనంద్‌, గురవయ్య, కోటి తదితరులు ఉన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరాలు



నెల్లేపల్లిలో పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్‌ సుప్రజ

రాపూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ అనిల్‌కుమార్‌, వైద్యాధికారిణి సుప్రజ తెలిపారు. రాపూరు మండలం నెల్లేపల్లి, పంగిలి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను మంగళవారం నిర్వహించారు. 285 పాడి పశువులు, 140 లేగదూడలు, 1456 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును అందించారు. 1300 గొర్రెలకు టీకాలు వేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది రమణయ్య, అఖిల్‌, మహేంద్ర, పాడి రైతులు పాల్గొన్నారు.

పోలీసు డైరీ ఆవిష్కరణ



పోలీసు డైరీ ఆవిష్కరిస్తున్న 9వ బెటాలియన్‌ అధికారులు

వెంకటగిరి రూరల్‌: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో 2025వ సంవత్సరం పోలీసు డైరీని ఇన్‌చార్జి కమాండెంట్‌ అరుణ్‌బోస్‌ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ కమాండెంట్‌, అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు



వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా గూడూరు మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో అధికారులు ఇన్‌చార్జి కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

వెంకటగిరి మున్సిపాలిటీ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు మంగళవారం పదవీబాధ్యతలు స్వీకరించిన గంటల వ్యవధిలోనే మున్సిపల్‌ అధికారులతో సమీక్షించారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు అధికారులు శ్రద్ధ వహించకపోవడం, తమ జీతాలు పెట్టుకునేందుకు శ్రద్ధ వహించడంపై అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను పారిశుధ్య కార్మికులకు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయండి

రాపూరు: నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్‌, సబ్‌రిజిస్ట్రార్‌, సబ్‌ ట్రెజరీ భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నెల్లూరు జిల్లా పంచాయతీరాజ్‌ శాఖ ఎస్‌ఈ అశోక్‌కుమార్‌ అధికారులను ఆదేశించారు. రాపూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న భవనాల పనులను మంగళవారం పరిశీలించారు. పంచాయతీరాజ్‌ ఈఈ సత్యనారాయణరెడ్డి , డీఈ ఏడుకొండలు, ఏఈ వాసు, కాంట్రాక్టర్‌ చెన్ను భాస్కర్‌రెడ్డి, ఇంజనీరింగ్‌ సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై సమావేశం

కలువాయి: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, నేర నివారణ చర్యలపై కలువాయి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్‌ఐ సుమన్‌ సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంపై చర్చించారు.

గీత కార్మికులకు 3 మద్యం దుకాణాలు

నాయుడుపేట టౌన్‌: నాయుడుపేట ప్రొహిబిషన్‌ ఎక్సైజ్‌ సర్కిల్‌ పరిధిలో గీత కార్మికులకు 3 మద్యం షాపులకు అనుమతుల వచ్చినట్లు ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ అరుణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయుడుపేట మున్సిపాలిటీ గౌడ కులం, ఓజిలి మండలంలో ఈడిగ కులం, పెళ్లకూరు మండలం గౌండ్ల కులాలవారికి మద్యం దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు.



కృష్ణాపురం ఎస్టీ కాలనీకి సమీపంలో నిర్వాసితుల స్థలాల్లో నిర్మాణాలు



నివేశ స్థలాలకు వేసిన ఫెన్సింగ్‌



చెరువు పోరంబోకు భూమిలో ఆక్రమిత స్థలంలో ఇంటి నిర్మాణాలు

ఆక్రమణల వివాదం

- శ్రీహరికోట నిర్వాసితుల స్థలం అన్యాక్రాంతం
- ఎవరికి వారే ఆక్రమించేస్తున్న వైనం
- అక్రమార్కుల ఇష్టారాజ్యం



ధ్వంసమైన హద్దు రాళ్లు

దొరవారిసత్రం: అక్కరపాక పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం ఎస్టీ కాలనీకి సమీపంలో జాతీయ రహదారికి దగ్గరలో నివేశన స్థలాల కోసం వివాదం నడుస్తోంది. శ్రీహరికోట నిర్వాసితులకు, స్థానికుల మధ్య వాదోపవాదాలతో పాటు వివాదం తలెత్తడంలో ఇరువర్గాల మధ్య మూడు రోజుల కింద ఘర్షణ చోటు చేసుకున్న విషయం ఆలస్యంగా మంగళవారం వెలుగు చూసింది. రెండు వర్గాలవారు స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడంతో పాటు తహసీల్దార్‌ శైలకుమారికి న్యాయం చేయాలంటూ ఇరువురు వినతులు అందజేశారు. సేకరించిన వివరాల మేరకు... శ్రీహరికోట(షార్‌) ఏర్పాటు సమయంలో అక్కడి వారికి పునరావాసం కింద 1970లో కృష్ణాపురం కాలనీకి సమీపంలో అక్కరపాక చెరువు(పీడబ్ల్యూడీ) పోరంబోకు భూమికి చెందిన 23 సర్వే నంబరులోని (సుమారు 70 ఎకరాలు పూర్తి విస్తీర్ణం) 19.98 ఎకరాలను 305ఏగా విభజించి 100 మందికి పైబడి శ్రీహరికోట నిర్వాసితులకు ఒక్కొక్కరికి 5సెంట్లు చొప్పున నివేశన స్థలాలు పంపిణీ చేశారు. అయితే ఈ స్థలాల్లో ఎవరూ కూడా అప్పటిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతోపాటు కన్నెత్తి ఈ స్థలాలు వైపు చూసిందిలేదు. భూముల విలువ (సెంటు రూ.2 లక్షల వరకు)పెరగడంతో సుమారు ఐదేళ్ల నుంచి కొందరు నిర్వాసితులు పట్టాలు చేతబట్టుకుని ఇంటి స్థలాలు ఉన్నాయంటూ 10 సెంట్లు, 20 సెంట్లు భూమిని అక్రమించుకుంటూ హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. కొంత మంది వారి వారి స్థలాల్లో ఇంటి నిర్మాణాలు సైతం చేపట్టి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలోనే మరి కొందరు ఇటీవల వచ్చి చెరువు పోరంబోకు భూముల్లో కూడా మాకే ఇచ్చారంటూ హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఫెన్సింగ్‌ వేసుకోవడం వంటివి చేయడంతో దీన్ని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో మధ్య వాదోపవాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఆయకట్టు రైతులు, సాగు నీటి సంఘం అధ్యక్షురాలు సొట్ట కూట్టెమ్మ రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేసి చెరువు పోరంబోకు భూమిని కాపాడిల్సిందిగా కోరారు.

ఇదే అదునుగా..

కృష్ణాపురం ఎస్టీ కాలనీకి సమీపంలో శ్రీహరికోట నిర్వాసితుల నివేశన స్థలాలను కొందరు అక్రమార్కులు, రియల్టర్లు బయట వారికి స్థలాలు అమ్మి లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. నిర్వాసితులు ఇచ్చిన నివేశన పట్టాలకు, స్థలాలకు సంబంధంలేని వ్యక్తులు, వారి బంధువులు అని చెప్పి కొందరు ఇవి మాకు చెందిన పట్టాలు, భూములు అంటూ ఇష్టారాజ్యంగా అక్రమించుకుని స్వాధీనం చేసుకున్నారు. తరువాత బయట వారి అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఇక్కడ నివేశన స్థలాల విషయంలో గత కొన్నేళ్లుగా పలు అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. అప్పట్లోనే రెవెన్యూ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



మూడు రోజుల కింద ముందు వేసిన రాళ్లను ధంసం చేస్తున్న రైతులు, స్థానికులు

అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు



అక్కరపాక చెరువు పోరంబోకు భూములు ఆక్రమణకు గురవుతున్నాయని రెవెన్యూ అధికారులు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఈ సమస్య గత కొన్నేళ్లగా జరుగుతూనే ఉంది. అధికారులు పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలి.

– తోట అంజారమ్మ, కృష్ణాపురం ఎస్టీ కాలనీ

ఇష్టారాజ్యంగా ఆక్రమించేశారు



శ్రీహరికోట నిర్వాసితులు ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ భూములు ఆక్రమించారు. చివరికి ప్రభుత్వ భూములను కూడా వదిలి పెట్టలేదు. పట్టాదారులు కాకపోయినా ఈ భూములు మాకే ఇచ్చారంటూ కొందరు దౌర్జన్యంగా ఆక్రమించి హద్దులు వేశారు.

– తుపాకుల హరీష్‌, కృష్ణాపురం ఎస్టీ కాలనీ

స్థానికులకు సెంటు భూమి లేదు



ఇక్కడ పుట్టి జీవించేవారికి సెంటు భూమి కూడా లేకుండా పోయింది. ఎక్కడి నుంచో వచ్చి భూములను ఆక్రమించి భవనాలు నిర్మించుకుంటున్నారు. ఆక్రమణలు జరుగుతున్న విషయం అధికారులకు తెలిసి కూడా పట్టించుకోవడం లేదు.

– కోట్లపాటి పోలమ్మ, కృష్ణాపురం ఎస్టీ కాలనీ

చెరువుకు హద్దులు ఏర్పాటు

అక్కరపాక చెరువు పోరంబో కు భూములు, చెరువు వి స్తీర్ణం వంటివి అన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం. అదే విధంగా కృష్ణాపురం ఎస్టీ కాలనీకి సమీపంలో శ్రీహరికోట నిర్వాసితుల నివేశన స్థలాలు వివాదం మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారించిన అనంతరం నిర్వాసితుల స్థలాల్లో ఏ పనులైనా చేపట్టాలని అందరికీ తెలియజేశారు.

– నాగరాజు, మండల సర్వేయారు, డీవీ సత్రం

హెల్మెట్‌ తప్పనిసరిగా ధరించాలి



టవర్‌క్లాక్‌ సెంటర్‌ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీఓ కిషోర్‌, డీఎస్పీ గీతా కుమారి

గూడూరు రూరల్‌: ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ ధరించాలని గూడూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి కిషోర్‌ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని టవర్‌క్లాక్‌ సెంటర్‌ నుంచి జాతీయ రహదారి కూడలి వరకు హెల్మెట్‌ ధరించి వాహనాలు నడుపుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ గీతాకుమారి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించి హెల్మెట్‌ ధరించాలని కోరారు. మోటారు వెహికల్‌ ఇన్‌స్పెక్టర్లు సునీల్‌, జకీర్‌, ప్రభాకర్‌, సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాసులు, కిషోర్‌బాబు, ఎస్‌ఐలు, విద్యార్థులు, వాహనాల డీలర్లు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలలో జాబ్‌ మేళా

గూడూరు రూరల్‌: గూడూరులోని ప్రభుత్వ ఐటీఐ. కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్‌ ఎక్స్ఛేంజ్‌, సీడాప్‌, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌ మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో వివిధ రంగాలకు చెందిన 3 బహుళ జాతీయ కంపెనీల హెచ్‌ఆర్‌ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు జరిపారు. 57 మంది యువతీ యువకులు వివిధ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరుకాగా 23 మంది యువతీ యువకులు ఉద్యోగ అర్హత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్‌ నాగరాజు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు మంచి అవకాశమని, వారి అర్హతకు తగ్గట్టు ఇంటర్వ్యూలో పాల్గొని అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ఉద్యోగంలో చేరి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్‌. శ్రావణ్‌, టీఓ వెంకటేశ్వర్లు, స్కిల్‌ హబ్‌ కో–ఆర్డినేటర్‌లు చెన్నయ్య, సునీల్‌, సీడాప్‌ సునీల్‌ పాల్గొన్నారు.

పచ్చనేతల ఇసుక పంచాయితీ





ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకురాలు సుష్మారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన

కోట: ఇసుక తరలింపు అధికార పార్టీ నేతల మధ్య నెలకొన్న పోటీ అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ క్రమంలో మండలంలోని తిన్నెలపూడి పంచాయతీకి చెందిన ఇద్దరు అధికార పార్టీ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ రెండు రోజులుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. టీడీపీకి చెందిన ఓ నాయకుడి అనుచరులు తిన్నెలపూడి వద్ద స్వర్ణముఖి నుంచి ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తుండగా అదే గ్రామానికి టీడీపీ నాయకురాలు గండవరం సుష్మారెడ్డి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వివాదం కాస్త తహసీల్దార్‌ జయజయరావు, ఎస్‌ఐ పవన్‌కుమార్‌ వద్దకు చేరింది. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో పెట్టాలని ఆమె వారిని కోరారు. అయితే ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఇసుక తరలించేందుకు అనుమతి ఉందని తేలడంతో ఆమె ఎంపీడీఓ వేణుతో అనుమతి ఎట్లా ఇస్తారంటూ వాదనకు దిగారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. సీసీ రోడ్లకు ఇసుక తోలుకునేందుకు మాత్రమే అనుమతి ఇచ్చామని ఎంపీడీఓ తెలిపారు. ఇద్దరు టీడీపీ నేతల మధ్య ఇసుక వివాదం ఆందోళనల వరకు చేరడంతో పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు కొందరు టీడీపీ నాయకులు అక్కడకు చేరుకుని సుష్మారెడ్డితో చర్చించి పరిస్థితి సద్దుమణిగేలా చేశారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



ఆసుపత్రిలో పురిటి బిడ్డలకు నూతన వస్త్రాలు అందిస్తున్న క్లబ్‌ ప్రతినిధులు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని వైజేపీ లయన్స్‌ క్లబ్‌ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని మగధ రీజియన్‌ పీఎంజేఎఫ్‌ లయన్‌ లీలాధర్‌రెడ్డి, కార్యదర్శి బాలప్రసన్నకుమార్‌ తెలిపారు. గూడూరులోని వైజేపీ లయన్స్‌ క్లబ్‌ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పరిశీలించేందుకు మంగళవారం పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు క్లబ్‌ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. గూడూరు మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పురిటి బిడ్డలకు నూతన వస్త్రాలు అందించారు. అనంతరం డీఎస్‌ఆర్‌ కమ్యూనిటీ హాల్‌ ఆవరణలో మొక్కలు నాటారు. పట్టణంలోని వృద్ధుల ఆశ్రమంలో భోజన వసతి కల్పించారు. ఉచిత కుట్టు శిక్షణా తరగతులను పరిశీలించారు. లయన్స్‌ క్లబ్‌ వైజేపీ ప్రతినిధులు ఎస్‌ఎల్‌ఎన్‌ స్వామి, చంద్రశేఖరరెడ్డి, గురునాథం, సుబ్రహ్మణ్యం, క్లబ్‌ అధ్యక్షులు మనోజ్‌కుమార్‌, శ్రీనివాస్‌యాదవ్‌, ప్రసాద్‌, ఆర్‌వీరావు, మురళీ నాయుడు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు



బహిరంగంగా మద్యం తాగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను పరిశీలించిన డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్‌: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఉపేక్షించేది లేదని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌ రాజు సూచనలు మేరకు నాయుడుపేట డివిజన్‌ పరిధిలో పలు మద్యం తాగే ప్రాంతాలను పోలీసు అధికారులు గుర్తించి, శుభ్రం చేశారు. పోలీస్‌ హెచ్చరికలు బోర్డులను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. నాయుడుపేట పట్టణంలోని చంద్రబాబు కాలనీలో డీఎస్పీ స్థానిక సీఐ బాబీతో కలిసి మందు బాబులు అడ్డాలను గుర్తించి అక్కడ పరిశుభ్రత కార్యాక్రమాల్లో డీఎస్పీ పాల్గొన్నారు. నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సీఐ, ఎస్‌లకు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూచించారు. పోలీస్‌ డివిజన్‌ కార్యాలయంలో మంగళవారం ఆరు మండలాల పోలీస్‌స్టేషన్‌లు, నాయుడుపేట, సూళ్లూరుపేట అర్బన్‌ స్టేషన్ల సీఐ, ఎస్‌ఐలతో క్రైమ్‌ మీటింగ్‌ నిర్వహించారు. పోలీస్‌ స్టేషన్‌ల వారీగా కేసుల వివరాలు తదితర విషయాలపై డీఎస్పీ సమీక్షించారు.

మల్లాం ఆలయంలో విశేష పూజలు



అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవార్లు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసియున్న వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి అవుపాలు, పంచామృతాభిషేకాలను పురోహితులు మాలంరాజు భానుప్రకాష్‌ శర్మ వేద మంత్రోచ్ఛరణతో చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. కుజదోషం ఉన్న వారు ఆలయంలో హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. మధ్యాహ్నం భక్తులకు దేవస్థానం వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామి వారికి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో చేపట్టారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మ వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ శశాంక్‌ పర్యవేక్షించారు.

7న చలో హైదరాబాద్‌



బూదూరులో జన సమీకరణ కోసం ప్రచారం

దొరవారిసత్రం: హైదరాబాదులో వచ్చే నెల 7న సామాజిక సంస్కృతి కార్యక్రమంలో భాగంగా వేల గొంతులు లక్షల డప్పులు అనే నినాదంతో ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరగబోయే కార్యక్రమం విజయవంతం చేసేందుకు మాదిగ ప్రజలను సమీకరిస్తున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు కంటేపల్లి నాగేశ్వరావు తెలిపారు. మంగళవారం బూదూరు, తనియాలి, బురదమడుగు తదితర గ్రామాల్లో పర్యటించి జన సమీకరణ చేశారు. హైదరాబాదుకు విచ్చేసే ప్రతి ఒక్కరు డప్పులు చేతబట్టుకుని తెలంగాణ ప్రభుత్వ గుండెలు అదిరేలా మోగించాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు.

నూతన వధువుకి బీరువా బహూకరణ



బీరువా అందిస్తున్న సంస్థ ప్రతినిదులు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని సునీత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల వివాహమైన నూతన వధువుకి మంగళవారం బీరువాను బహూకరించారు. సైదాపురం ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులు లేని మోపూరు చందన అనే యువతికి ఇటీవల వివాహం నిశ్చయమైంది. బలిజ అభ్యుదయ మహిళా సంఘం వారు వివాహానికి అవసరమైన సామగ్రితో పాటుగా నూతన వస్త్రాలను అందించారు. కాపు హెల్పింగ్‌ క్లబ్‌ తరపున మలిశెట్టి వెంకటేశ్వరరావు, సర్వేల్లి భవానిప్రసాద్‌, కమతం సుబ్బారావు, సునీతా సేవా సంస్థవారు బీరువాను అందించారు. సారంగం సులక్ష్మి తదితరులు ఉన్నారు.

అగ్రహారంలో పశువైద్య శిబిరం

కలువాయి: తోపుగుంట అగ్రహారంలో మంగళవారం పశువైద్యాధికారి డాక్టర్‌ గంగాధరరావు శిబిరం నిర్వహించారు. 210 గేదెలు, 15 ఆవులు, 82 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. గర్భకోశ వ్యాధులతో బాధ పడుతున్న 24 పశువులకు చికిత్స చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో మందులు పిచికారీ చేయాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ

దక్కిలి: ప్రస్తుతం వరి సాగులో ఆశించే తెగుళ్ల నివారణకు సకాలంలో క్రిమి సంహారక మందులను పిచికారీ చేయాలని వెంకటగిరి వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జున సాగర్‌ తెలిపారు. మండలంలోని శ్రీపురం, మాటుమడుగు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వరి పంటలో దోమపోటు అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సకాలంలో వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు. పంట వెన్ను దశలో పంటకు పుష్కలంగా నీరు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయభారతి, సిబ్బంది ఉన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఏఈఎస్‌ ఊహశ్రీ

గూడూరు రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు, గౌడ, ఉపకులాలకు మద్యం షాపులు కేటాయించేందుకు చర్యలు తీసుకుందని గూడూరు అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ఊహశ్రీ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఫిబ్రవరి 5వ తేదీలోగా అప్లికేషన్లను ఆన్‌లైన్‌లోగాని, గూడురు ఎక్సైజ్‌ కార్యాలయంలో అందజేయాలని కోరారు. మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గూడూరు డివిజన్‌లో మొత్తం 12 మద్యం దుకాణాలను కల్లుగీత కార్మికులు, గౌడ, ఉపకులాలకు కేటాయించామన్నారు. ఎక్సైజ్‌ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ ఏర్పాటు చేశామని, వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఎక్సైజ్‌ అధికారులు కరీమా బేగం, అరుణకుమారి, సురేంద్ర పాల్గొన్నారు.

గీత కులాల వారికి రెండు మద్యం షాపులు

వాకాడు: వాకాడు ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలో కల్లు గీత కులాల వారికి రెండు మద్యం షాపులను ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిందని సీఐ ప్రసాద్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో తన కార్యాలయంలో మాట్లాడుతూ గీత కులాల వారికి ప్రభుత్వం మరో రెండు మద్యం షాపులను కేటాయించామదన్నారు. వాకాడు మండలంలో 1, చిట్టమూరు మండలంలో 1 మద్య షాపు కోసం దరఖాస్తులు తమ కార్యాలయంలో స్వీకరిస్తామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి దాతల చేయూత



అంగన్‌వాడీ పిల్లలకు విద్య సామగ్రి, వస్తువుల పంపిణీ

నాయుడుపేట టౌన్‌: పట్టణంలోని సప్తగిరి చెరువు కట్ట సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి పట్టణానికి చెందిన దాతలు పెన్నేపల్లి గ్రామ మాజీ సర్పంచ్‌ గాలి రమేష్‌ నాయుడు, జయప్రద దంపతులు మంగళవారం చేయూత అందించారు. పలకలు, విద్యా సామగ్రి, టూత్‌ పేస్టులు, బ్రష్‌లు, సబ్బులు, బిస్కట్‌ ప్యాకెట్లు, అవసరమైన వంట సామగ్రి కుక్కర్లు, ఫ్యాన్లు, అందించారు. దాత కుమారుడు గాలి లిఖిత్‌ ద్వారా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పిల్లలందరికి బిర్యాని ప్యాకెట్‌లను అందించారు. నాయకులు గాలి రాజేష్‌ నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు మలిశెట్టి శివప్రసాద్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ ఆషా బేగం, అంగన్‌వాడీ కార్యకర్త నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి



మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌

గూడూరు రూరల్‌: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని విక్రమ సింహపురి యూనివర్శిటీ వైస్‌ ఛాన్సలర్‌ ప్రొఫెసర్‌ విజయభాస్కర్‌ అన్నారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో మంగళవారం సాయంత్రం 44వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ విజయభాస్కర్‌ హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన కల్చరల్‌ డే సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అమరావతి గ్రూప్స్‌ డైరెక్టర్‌ ప్రత్యూష ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల కరస్పాండెంట్‌ కె.మెహర్మణి, కోశాధికారి విద్యాసాగర్‌, హనుమంతరావు పాల్గొన్నారు.

తెల్లరాయి లారీపై కేసు నమోదు

సైదాపురం: తెల్లరాయి తరలిస్తున్న లారీపై మంగళవారం సైదాపురం పోలీసులు కేసును నమోదుచేశారు. ఎస్‌ఐ క్రాంతి కుమార్‌ ఇచ్చిన వివరాల మేరకు శుక్రవారం తెల్లవారు జామున అక్రమంగా తెల్లరాయిని తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. పోలీసులు మైనింగ్‌ అధికారులకు లారీని అప్పగించారు. అయితే సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్పీ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో లారీపై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేస్తున్న ఎస్‌ఐ పేర్కొన్నారు.